
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 3 । జనవరి । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి చిలకలూరిపేట వెంగళ్రావునగర్‌కు చెందిన నాగండ్ల అద్రిత్ పేరిట కుటుంబ సభ్యులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 569.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,019 క్యూసెక్కులు వదిలారు.



బగళాముఖి సేవలో మనో

చందోలు(కర్లపాలెం): ప్రముఖ సినీ నేపథ్య గాయకులు మనో దంపతులు గురువారం చందోలు బగళాముఖి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

న్యూస్‌రీల్

మద్యం షాపు ప్రాంగణంలో తాగితే చర్యలు

ఒంగోలు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామారావు



సాక్షి ఎఫెక్ట్

వేటపాలెం: మద్యం షాపుల ప్రాంగణంలో తాగితే చర్యలు తీసుకుంటామని ఒంగోలు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ సోమిశెట్టి రామారావు పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని మద్యం షాపులను తనిఖీ చేశారు. మద్యం దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్ రూములు ఏర్పాటు చేశారని ఈనెల 2వ తేదీన సాక్షి దినపత్రికలో 'బార్‌లా మద్యం దుకాణాలు' అనే కథనాన్ని ప్రచురించింది. ఇందుకు ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ రామారావు మాట్లాడుతూ వేటపాలెంలో మద్యం షాపుల తనిఖీ సమయంలో దుకాణం ప్రాంగణంలో తాగుతునట్లు కనిపించలేదని పేర్కొన్నారు. పత్రికలో వచ్చిన కథనం మేరకు గ్రామంలో మద్యం షాపులను తనిఖీ చేశామన్నారు. షాపు నుంచి కొనుగోలు చేసుకొని వెళ్లి పోవాల్సిందే తప్పా, ప్రాంగణంలో సిట్టింగులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. త్వరలో ఆకస్మిక దాడులు జరుపుతామని, అప్పుడు ప్రాంగణంలో మద్యం తాగుతున్నట్లు కనిపిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిబంధనల ప్రకారం షాపు నడుపుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని యజమానులకు సూచించామని తెలిపారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి మోహనరంగారావు, మహిళా కానిస్టేబుల్ ఉన్నారు.

ప్రశాంతంగా బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బీపీఈడీ, ఎంపీఈడీ మూడవ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల కోఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. వర్సిటీలోని యోగా కేంద్రంలో పరీక్షల కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష రాస్తున్న విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. వసతులను తనిఖీ చేశారు. అన్ని సౌకర్యాలు వెంటనే కల్పించాలని చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.సూర్యనారాయణకు ఆదేశాలు జారీ చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ మూడో సెమిస్టర్ పరీక్షల్లో గురువారం కొందరు విద్యార్థులు హాల్ టికెట్ లేకుండా పరీక్షకు హాజరైనట్లు పరీక్షల కో ఆర్డినేటర్ గమనించారు. ఆ విద్యార్థులను ఎగ్జామ్స్ సెంటర్ నుంచి బయటకు పంపారు. తర్వాత హాల్ టికెట్లు తెచ్చుకోవడంతో అనుమతి ఇచ్చినట్లు సుబ్బారావు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నగరంపాలెం: హైకోర్టు ఆధీకృత క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారధి ఆవిష్కరించారు. జిల్లా జడ్జి బంగ్లాలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. రెండో అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా, మూడో అదనపు జిల్లా జడ్జి సీఎస్ శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి, చల్లా క్రాంతి కుమార్, కృష్ణారెడ్డి, ఆర్‌కేఎస్ మూర్తి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



నగరంపాలెం: ఈనెల మూడో తేదీ నుంచి మహిళా కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గుంటూరు నగరంపాలెంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈనెల 3, 4, 6 తేదీల్లో జరిగే దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి మహిళా పోలీస్ అధికార, సిబ్బందికి జిల్లా పలు సూచనలు చేశారు. మూడో తేదీన 530 మందికి, 4వ తేదీన 535 మంది, ఆరో తేదీన 536 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంటి దొంగల దోపిడీ

కంచె చేను మేసిన చందంగా మారింది గ్రామ పంచాయతీల పరిస్థితి. సిబ్బంది, అధికారుల ధన దాహానికి ఒట్టిపోతున్నాయి. పంచాయతీ నిధులకు రక్షణగా ఉండి ఆయా గ్రామాల్లో మౌలిక వసతులకు వినియోగించాల్సిన నిధులను కొందరు అధికారులు దారి మళ్లిస్తున్నారు. ఇంటి పన్నుల తాలూకు నగదు పంచాయతీ ఖాతాలకు జమ చేయకుండా తమ జేబుల్లో దర్జాగా వేసుకుంటున్నారు. లక్ష కాదు రెండు లక్షలు కాదు కోట్ల రూపాయల్లో అవినీతి జరిగిందని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

కంచె చేను మేసింది
- పంచాయతీ నిధులు మింగేస్తున్న సిబ్బంది
- బ్యాంకు ఖాతాలకు జమ చేయని ఇంటి పన్నులు
- నిధులు లేక కార్మికుల జీతాలివ్వని వైనం
- ఇంటి పన్నులు కట్టిన వారికి కట్టనట్లు నోటీసులు
- విచారణ జరిగితేనే అక్రమాలు బట్టబయలు

వేటపాలెం: ప్రజలు కట్టిన ఇంటి పన్నులు కొందరు అవినీతి సిబ్బంది, అధికారుల పాలవుతున్నాయి. ఈ అక్రమ వ్యవహారంపై ఉన్నత అధికారులకు పూర్తిస్థాయిలో సమాచారం ఉన్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పంచాయతీల్లో జిల్లాస్థాయి అధికారులు విచారణ జరిపినప్పటికీ, అది బయటకు పొక్కకుండా ఉండటం విశేషం.

అవినీతి జరుగుతోంది ఇలా!

కరోనా సమయంలో రెండేళ్ల పాటు గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూళ్లు మందగించాయి. అప్పటిలో బకాయిలు భారీగా పేరుకు పోయాయి. దీన్ని కార్యదర్శులు, సిబ్బంది ఆసరాగా తీసుకున్నారు. కరోనా అనంతరం పంచాయతీ రాజ్ శాఖ గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలుపై ప్రత్యేక చర్యలు చేపట్టింది.



మూడేళ్లగా ఇంటి పన్నులు బకాయి కట్టమని ఇచ్చిన డిమాండ్ నోటీసు

దీంతో పాత బకాయిల సహా కోట్ల రూపాయల వసూలు జరిగాయి. అయితే, కార్యదర్శులు నగదు పంచాయతీ బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా పక్కదారి పట్టించారు. చీరాల నియోజకవర్గంలో చీరాల రూరల్ పరిధిలో 16, వేటపాలెం మండల పరిధిలో తొమ్మిది గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మేజర్ పంచాయతీల్లో అధిక మొత్తంలో నిధులు గోల్‌మాల్ జరిగాయి. వీటితో పాటు మైనర్ పంచాయతీల్లో కూడా లక్షల్లో జరిగినట్లు సమాచారం.

ప్రత్యేక అధికారుల పాలనలోనే మొత్తం అవినీతి

చీరాల నియోజకవర్గం పరిధిలో గడిచిన ఐదేళ్లగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అయితే, వీరు మాతృశాఖ పనులు చూసుకుంటూ నెలకు, రెండు నెలలకు ఒక సారి వచ్చి వెళ్తుంటారు. 2018 ఆగస్టులో సర్పంచ్‌ల పాలన ముగిసింది. అప్పటి నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. 2021 ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. అయితే, నియోజకవర్గ విభజనలో భాగంగా కొన్ని కొత్త పంచాయతీలు ఏర్పాటు చేశారు. దీనిపై తెలుగుదేశం నాయకులు హైకోర్టుకు వెళ్లడంతో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతోంది. కేవలం వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీకి మాత్రమే ఎన్నికలు జరిగాయి.



గడిచిన మూడేళ్లగా ఇంటి పన్ను కట్టినట్లు పంచాయతీ సిబ్బంది ఇచ్చిన రశీదు

అభివృద్ధికి పూర్తి ఆటంకం

గ్రామంలో పన్నుల రూపంలో వసూలు చేసిన లక్షల రూపాయలను గోల్‌మాల్ చేయడంతో పారిశుధ్య సిబ్బందికి జీతాలు ఇవ్వడం కూడా కష్టంగా మారింది. నిధుల గోల్‌మాల్ జరిగినట్లు మండల, జిల్లాస్థాయి అధికారులు దృష్టికి వచ్చినప్పటికీ దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపక పోవడంపై ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా లోతైన విచారణ చేసి అక్రమార్కుల నుంచి తిరిగి నగదు రాబట్టాలని ఆయా పంచాయతీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నోటీసులతో గ్రామస్తుల్లో ఆందోళన

వేటపాలెం గ్రామ పంచాయతీలో ప్రస్తుతం 2024–25 సంవత్సరానికి సంబంధిచిన ఇంటి పన్నులు కట్టాలని గ్రామంలో నోటీసులు ఇస్తున్నారు. అయితే, పంచాయతీ సిబ్బంది ఇచ్చిన నోటీసులు చూసి ప్రజలు విస్తుపోతున్నారు. గత రెండేళ్లగా ఇంటి పన్నులు కట్టిన వారికి కట్టనట్టు.. బకాయిలు ఉన్నట్లు నోటీసులో పొందుపర్చారు. ఈ విధంగా గ్రామంలో వంద సంఖ్యలో ప్రజలకు గడిచిన రెండేళ్లగా ఇంటి పన్నులు బకాయిలు ఉన్నాయని నోటీసులు ఇచ్చారు. గతేడాది దేశాయిపేట, కొత్తపేట పంచాయతీల పరిధిలోనూ ఇంటి పన్నుల బకాయిలు ఉన్నట్లు నోటీసులు ఇచ్చారు.

పూర్తి స్థాయిలో విచారణ

వేటపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి పన్నులు కట్టినప్పటికీ కట్టనట్లు డిమాండ్ నోటీలు ఇచ్చిన విషయం తెలిసింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఇటువంటి పొరపాట్లు జరకుండా చర్యలు చేపడతాం.

– శ్రీనివాసరావు, ఈఓఆర్‌డీ, వేటపాలెం

నిధులు గోల్‌మాల్ ఇలా..

వేటపాలెం గ్రామ పంచాయతీలో అప్పటిలో రూ.12 లక్షల నిధులు గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించారు. దీనిపై విచారణ జరిపించారు.
- రామన్నపేట పంచాయతీలో రూ. 12 లక్షల నిధులు ఖాతాకు జమ చేయకుండా అప్పటి కార్యదర్శి గోల్‌మాల్ చేశాడు. ఆ కార్యదర్శి బదిలీపై వెళ్తూ కేవలం రూ.6 లక్షలు తిరిగి బ్యాంకు ఖాతాకు జమ చేసి వెళ్లిపోయాడు. దీనిపై ఎటువంటి విచారణ జరగలేదు.
- కొత్తపేట పంచాయతీలో గడిచిన ఐదేళ్ల నుంచి రూ. 1 కోటి పైచిలుకు నిధుల గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై జిల్లా స్థాయి అధికారులు విచారణ జరిపారు. కానీ విచారణ విషయాలు బయటికి పొక్కకుండా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



వేటపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంజనీ ప్రసాదరెడ్డి

- అధికార ప్రతినిధులుగా జి. కృష్ణమూర్తి, కె.వెంకటకృష్ణారెడ్డి, సయ్యద్ సిరాజుద్దీన్
- జిల్లా కమిటీలో పలువురికి స్థానం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలానికి చెందిన అంజనీ ప్రసాదరెడ్డిని నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కమిటీ గురువారం ప్రకటించిన జిల్లా కమిటీలో పలువురుకి స్థానం కల్పించింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా అద్దంకికి చెందిన జ్యోతి హనుమంతరావును, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బాపట్లకు చెందిన ఎం.సముద్రాలు గౌడ్, ఎన్.చక్రపాణి, రేపల్లెకు చెందిన వై.శ్రీనివాసరావు, నిజాంపట్నానికి చెందిన కోటేశ్వరరావు, వేమూరుకు చెందిన జి. వీరరాఘవులు, టి.శ్రీనివాసరావులను నియమించారు. యాక్టివిటీ సెక్రటరీలుగా బాపట్లకు చెందిన ఐ.అంకమ్మరావు, వై.సుబ్బారావు, రేపల్లెకు చెందిన వి.శాంతిరాజు , పి.సాంబశివారెడ్డి, వేమూరుకు చెందిన సి.సాంబిరెడ్డి, ఎం.నాయుడమ్మ, అధికార ప్రతినిధులుగా బాపట్లకు చెందిన గవిని కృష్ణమూర్తి, రేపల్లెకు చెందిన కె.వెంకట కృష్ణారెడ్డి, వేమూరుకు చెందిన సయ్యద్ సిరాజుద్దీన్‌లను నియమించారు.

ముక్కోటి ఏకాదశి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మంగళగిరి: మంగళగిరి పట్టణంలోని పానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను గురువారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. మంత్రి లోకేష్ మాటాడుతూ ముక్కోటి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఆలయ అధికారులకు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వామి వారి దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఏ రామకోటిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నగదు చూపుతున్న ఎస్పీ తుషార్ డూడీ

జాతీయ సైబర్ నేరగాళ్ల అరెస్టు

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- చుండూరు సైబర్ కేసులో విస్తృత దర్యాప్తు
- రాజస్థాన్‌లో ఇద్దరు నిందితుల అరెస్టు
- ముంబైలోనూ విస్తృత గాలింపు

బాపట్ల: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేసి బెదిరిస్తే తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. బాపట్ల జిల్లా చుండూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన సైబర్ కేసుపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసిన పోలీసులు ఇద్దరు జాతీయ సైబర్ నిందితులు రాజేష్, శ్రవణ్ కుమార్‌లను అరెస్టు చేశారు. వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుషార్ డూడీ వెల్లడించారు. చుండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల వేటపాలేనికి చెందిన గొంది శ్రీలక్ష్మీ వరప్రసాదరావు అనే రిటైర్డ్ ప్రొఫెసర్‌ను సోషల్ మీడియా ద్వారా సీబీఐ ఆఫీసర్ అని చెప్పి, ఆయనపై మనీ లాండరింగ్ కేసు నమోదు అయిందని నేరగాళ్లు బెదిరించారన్నారు. కేసు నుంచి బయట పడాలంటే డబ్బులు అవుతాయని బెదిరించి రూ. 74 లక్షలు వేయించుకొని మోసం చేశారని తెలిపారు. ఈ మేరకు బాధితుడు చుండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.

కేసును సవాలుగా తీసుకుని దర్యాప్తు

వరుసగా జరుగుతున్న డిజిటల్ తరహా సైబర్ నేరాలను దృష్టిలో ఉంచుకొని చుండూరు కేసును సవాలుగా తీసుకున్నామని ఎస్పీ తెలిపారు.బాపట్ల ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో సాంకేతిక బృందం ఇచ్చిన సమాచారం మేరకు చుండూరు సీఐ సీహెచ్.వి. శ్రీనివాసరావు నేతృత్వంలో ఒక బృందం రాజస్థాన్ రాష్ట్రానికి, ఆర్ఐ శ్రీకాంత్ నేతృత్వంలో మరొక బృందం ముంబైకి వెళ్లారన్నారు. రాజస్థాన్ వెళ్లిన బృందం ఏ- 3 రమేష్‌ను పట్టుకొని అతని వద్ద నుంచి రూ.2 లక్షలు, ఏ–4 శ్రావణ్ కుమార్‌ని పట్టుకొని అతని వద్ద ఐదు లక్షలు రికవరీ చేశామన్నారు. ఆ క్రమంలో నిందితుల అకౌంట్లను తనిఖీ చేయగా వారు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిశా, వెస్ట్ బెంగాల్, గుజరాత్ ,తెలంగాణ, రాజస్థాన్.. ఇలా మొత్తం 18 రాష్ట్రాల్లో 39 జిల్లాల్లో 43 పోలీస్ స్టేషన్ల పరిధిలో రూ.12.30 కోట్ల నగదు బదిలీ జరిగినట్లు గుర్తించినట్లు చెప్పారు. వీరిలో ఏ-3 ఆరు కేసుల్లో రూ.15 లక్షలు, ఏ–4 ఏడు కేసుల్లో రూ. 35 లక్షలను తమ అకౌంట్‌కు డబ్బులు వేయించుకున్నట్లు గుర్తించామని ఎస్పీ వివరించారు. చుండూరు కేసుకు సంబంధించి ఏడు లక్షలు రికవరీ చేశామని, రెండో బృందం మహారాష్ట్రలో సైబర్ ముద్దాయిల కోసం గాలిస్తోందని తెలిపారు. చుండూరు కేసులో డబ్బులు బదిలీ అయిన నిందితుల ఐదు ఖాతాలను విచారణలో భాగంగా ఎన్సీఆర్పీ పోర్టర్‌లో పరిశీలించినప్పుడు, వీరిపైన 18 రాష్ట్రాల్లోని 39 జిల్లాల్లో 43 పోలీస్ స్టేషన్ల పరిధిలో రూ. 10 కోట్ల మోసం చేసినట్లు కేసులు నమోదయ్యాయని చెప్పారు. నిందితుల ఐదు ఖాతాల్లో రూ.12.30 కోట్ల నగదు బదిలీ జరిగినట్లు గుర్తించామని వివరించారు. మిగిలిన నిందితులను కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

డిజిటల్ అరెస్టులు ఉండవు

డిజిటల్ అరెస్ట్ అనేది లేదని, భయభ్రాంతులకు గురై అపరిచితులను నమ్మి మోసపోవద్దని ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. సైబర్ నేరస్తుల రకరకాలుగా ప్రజలను మోసం చేస్తున్నారని, వీటిని అరికట్టేందుకు నిత్యం పోలీస్ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే 1930కు కాల్ చేయాలని, జిల్లా టెక్నికల్ బృందం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. కేసులో విశేష కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని, ఐటీ కోర్ బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- సాక్షితో జిల్లా కలెక్టర్ వెంకట మురళి
- అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయని అధికారుల పైనా వేటు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఇసుక అక్రమ రవాణాను ఎట్టిపరిస్థితిలో సహించేది లేదని, అడ్డకట్ట వేయని అధికారుల పైనా వేటు తప్పదని జిల్లా కలెక్టర్ వెంకటమురళి చెప్పారు. ఆయన గురువారం సాక్షితో మాట్లాడారు. ఇసుక, బుసక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం గ్రామ, మండలస్థాయి అధికారులతో కమిటీలు వేశామని తెలిపారు. నిత్యం వారు పర్యవేక్షిస్తూ అక్రమ రవాణాదారులకు జరిమానాలు విధించడంతోపాటు ఎప్పటికప్పుడు తహసీల్దారు, ఆర్డీవో స్థాయి అధికారులకు నివేదికలు సమర్పించాలని ఆదేశించామని చెప్పారు. అయితే, చీరాల మండల పరిధిలో ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా అధికంగా జరుగుతోందని ఆయా ప్రాంతాల ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులందాయని తెలిపారు. కానీ ఆయా గ్రామాల పరిధిలోని గ్రామస్థాయి అధికారులు మాత్రం ప్రభుత్వానికి అక్రమ తవ్వకాల విషయం నివేదించలేదన్నారు. దీంతో కొందరు గ్రామస్థాయి అధికారులను సస్పెండ్ చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఇసుక అక్రమ తవ్వకాలకు సహకరించే ఏ ఒక్కరినీ వదిలేది లేదన్నారు. స్థానిక అధికారులకు తెలియకుండా ఇసుక, బుసక అక్రమ రవాణా జరిగే అవకాశం లేదని తెలిపారు. దీంతో చీరాల తహసీల్దారుతోపాటు మరికొందరు అధికారులను సైతం వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చామని వెల్లడించారు. అక్రమ తవ్వకాలను, రవాణాను కట్టడి చేయకుండా నిర్లక్ష్యం వహించిన ఉన్నతాధికారుల పైనా వేటు తప్పదని హెచ్చరించారు. నిబంధనల మేరకు అధికారులపై చర్యలుంటాయని స్పష్టం చేశారు.

రూ. 60.97 లక్షల అపరాధ రుసుం వసూలు

జిల్లాలో ఇసుక అక్రమరవాణాకు సంబంధించి 147 మంది నుంచి రూ. 60.97 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. 34 మంది అక్రమ తవ్వకం దారులకు రూ. 17 కోట్ల మొత్తానికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. అక్రమ ఖనిజ తవ్వకం దారులపై చిన్నతరహా ఖనిజ నియమావళి 1966కు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జిల్లాలో ఇసుక, బుసకతోపాటు ఇతర ఖనిజాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని కలెక్టర్ వెంకట మురళి పేర్కొన్నారు.

అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఇసుక, బుసక ఇతర ఖనిజాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు మైనింగ్ ఏడీ రాజేష్ తెలిపారు. అక్రమ తవ్వకాలు, రవాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ సూచనలందుకొని వాటిని కిందిస్థాయి అధికారులకు పంపించి అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

అదనపు వసూలు యావ.. ఇవ్వని తోవ

- టోల్ గేట్ వద్ద వాహనదారుల ఇక్కట్లు
- యాజమాన్య వైఖరితో మూడు నెలలుగా ఇబ్బందులు



బొల్లాపల్లి టోల్ ప్లాజా

మార్టూరు: బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం ఉదయం 7:30 గంటల నుంచి ఎనిమిది గంటల మధ్య మంచులో సుమారు 500 మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు నెలలుగా తరచూ జరుగుతున్న ఈ తతంగం టోల్ గేట్ మేనేజర్ కిరణ్ తన దృష్టికి రాలేదని చెప్పడం విడ్డూరంగా ఉంది. టోల్ ప్లాజా వద్ద భారీ వాహనాలు, కార్లు ఆటోల వంటి చిన్న వాహనాల రాకపోకల కోసం నిర్వాహకులు ప్రత్యేక ద్వారాలు ఏర్పాటు చేశారు. భారీ వాహనాల రాకపోకల సమయంలో ప్రతిరోజు ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నట్లు సమాచారం.

ఓవర్ లోడ్‌ను చూపించని టోల్ యంత్రాలు

భారీ వాహనాల డ్రైవర్లు తాము బయలుదేరిన చోటే యజమానుల ఆధ్వర్యంలో కాటా వేయించుకొని సంబంధిత పేపర్లతో డెలివరీకి బయలుదేరి వెళ్తారు. టోల్ ప్లాజా వద్ద రుసుం చెల్లించే సమయంలో అక్కడ వేయింగ్ మిషన్‌లో ఒక్కోసారి ఓవర్ లోడ్ చూపించడంతో సమస్య ప్రారంభమవుతోంది. ఏదైనా కారణంతో లారీ డ్రైవర్ దగ్గర ఉన్న పేపర్లకు మించి కొంత అదనపు లోడు వేయింగ్ మిషన్‌లో చూపిస్తే దానికి డబ్బు చెల్లిస్తేనే కానీ వాహనాన్ని సిబ్బంది ముందుకు పోనివ్వకుండా అడ్డుకుంటున్నారు.



టోల్ ప్లాజా ముందు మంచులో నిలిచిన వాహనాలు

అంతేకాక ఓవర్ లోడ్ చూపించిన వాహనాన్ని ముందుకు వెళ్లేందుకు వీలు లేకుండా సిగ్నల్ వ్యవస్థను సైతం ఏర్పాటు చేయడంతో ఇబ్బంది ఎదురవుతోంది. వాహనాన్ని బయటకు పంపే సిగ్నల్ గేటు కూడా సహకరించదు. ఇక్కడే సిబ్బందికి, డ్రైవర్లకు వాదనలు ప్రారంభమై వాహనాలు ముందుకు కదలడం లేదు. వెనుక ఉన్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ వద్ద డబ్బు లేదని, అదనపు రుసుం చెల్లించలేమని వాదనకు దిగిన వాహనాల డ్రైవర్లను సిబ్బంది టోల్ ప్లాజా సమీపంలోని వే బ్రిడ్జి వద్దకు వెళ్లి మరోసారి కాటా వేయించుకు రమ్మని వెనక్కు పంపుతున్నారు. ఈ క్రమంలో వెనుక ఉన్న వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విధంగా అదనపు లోడు పేరుతో టోల్ యాజమాన్యం ప్రతిరోజు వాహనదారుల నుంచి అదనంగా వసూలు చేస్తున్న మొత్తం నెలకు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉంటోంది. ఈ విషయమై టోల్ ప్లాజా మేనేజర్ కిరణ్‌ను వివరణ కోరగా ఈరోజు వాహనాలు అర కిలో మీటర్ మేర నిలిచిపోయిన సంగతే తనకు తెలియదని, సిబ్బందిని కనుక్కొని చెబుతానని, తర్వాత సమాధానం చెప్పకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

పాల ట్యాంకర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం



సంతమాగులూరు (అద్దంకి రూరల్): ముందు వెళ్తున్న పాల ట్యాంకర్‌ను వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన గురువారం సంతమాగులూరు మండలం పాతమాగులూరు వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ పట్టాభి రామయ్య వివరాల మేరకు.. నరసరావుపేటకు చెందిన రంగా శివ (30) స్కూటీ మీద సంతమాగులూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను గమనించక ఢీకొట్టాడు. స్కూటీ లారీ వెనుక వైపు దూసుకుపోవటంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

'తానా' నవలల పోటీకి రచనల ఆహ్వానం

తెనాలి: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) రెండేళ్లకోసారి నిర్వహించే నవలల పోటీని ఈ ఏడాది రూ.2 లక్షల బహుమతితో నిర్వహిస్తోంది. 1997 నుంచి జరుపుతున్న ఈ పోటీలను మధ్యలో కొంత విరామంతో 2017 నుంచి కొనసాగిస్తోంది. ఈ పోటీల్లో బహుమతులు గెలిచిన, శప్తభూమి, నీల, ఒంటరి, కొండపొలం, మున్నీటి గీతలు, అర్ధనారి నవలలు పలు అవార్డులను గెలిచాయి. కొండపొలం సినిమాగా రాగా, మున్నీటి గీతలు వెబ్ సిరీస్‌గా వస్తోంది. రాబోయే జులై 3,4,5 తేదీల్లో డెట్రాయిట్‌లో జరగనున్న తానా మహాసభల సందర్భంగా మళ్లీ నవలల పోటీలు జరుపుతున్నట్టు తానా కార్యక్రమ నిర్వాహకులు జంపాల చౌదరి, ప్రచురణల కమిటీ అధ్యక్షుడు చంద్ర కన్నెగంటి గురువారం ప్రకటించారు. రచయితలు తమ రచనలను ఏప్రిల్ 15వ లోగా అక్షర క్రియేటర్స్, ఏజీ-2, ఎ-బ్లాక్, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్, హైదర్‌గూడ, హైదరాబాద్-500029 చిరునామాకు పంపాలని వివరించారు. ఇతర వివరాలకు 9849310560, 9949656668 నంబర్లను సంప్రదించాలని కోరారు.

భూములిచ్చిన రైతులకు శుభవార్త

తాడేపల్లి రూరల్ : ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ కింద రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు రిటర్నబుల్ ప్లాట్స్ ఇచ్చేందుకు గురువారం సన్నాహాలు చేపట్టారు. దానిలో భాగంగా ఆయా గ్రామాల్లోని సీఆర్‌డీఏ కార్యాలయంలో వివరాలు అందుబాటులో ఉంచారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని డిప్యూటీ కలెక్టర్ చిన్నికృష్ణ తెలిపారు. జనవరి నెలాఖరు వరకు ఉదయం 10 – సాయంత్రం 5 గంటల మధ్య అభ్యంతరాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. యూనిట్ సర్వేయర్ కె.అశోక్ – 97002 26636, గ్రామ సర్వేయర్లు అంకారావు 81791 34934, బి. మెహబూబ్ 86887 35648 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడితే చర్యలు

కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం వికలాంగుల పెన్షన్ల పంపిణీపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో యద్దనపూడి మండలం పూనూరులో వికలాంగుల పెన్షన్‌లపై జరిగిన సర్వేపై ఆరా తీశారు. జిల్లాలో ప్రతినెలా పింఛన్ల కింద రూ. 95 కోట్లు విడుదల అవుతున్నాయని తెలిపారు. పూనూరులో జరిగిన సర్వే మాదిరిగా జిల్లా మొత్తం సర్వే జరిపితే సుమారు 18 శాతం పింఛన్లు తగ్గుతాయన్నారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ఆరా తీశారు.జిల్లాలో పింఛన్ల పంపిణీలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని 13 శాతం మంది తెలిపారన్నారు. తొమ్మిది శాతం మంది ఇంటి వద్ద పెన్షన్లు ఇవ్వడం లేదని, 11 శాతం మంది పింఛన్ అందించిన అధికారి ప్రవర్తన బాగోలేదని తెలిపారని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు వారి మండలాలలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా కోఆర్డినేటర్, ఆసుపత్రిల సేవా అధికారి శేషకుమార్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు స్వస్తి పలుకుదాం

పర్యావరణానికి హానిచేసే క్యారీ బ్యాగులు విడనాడి, గుడ్డ సంచులు వాడటాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని జిల్లాకలెక్టర్ కె.వెంకట మురళి పిలుపునిచ్చారు. గుడ్డ సంచులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామని ఆయన తెలిపారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో గురువారం గుడ్డ సంచుల ఉచిత పంపిణీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఫ్రెండ్స్ సంస్థ నిర్వాహకులు నాశం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ ప్రజలకు పంపిణీ నిమిత్తం 400 సంచులను పురపాలక సంఘానికి అందజేస్తున్నట్లు ఫోరం కార్యదర్శి పి.సి. సాయిబాబు తెలిపారు.

చిలకమ్మవారిపాలెంలో వ్యక్తి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం ?
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



లుక్కా నాగరాజు (ఫైల్)

నగరం: వివాహేతర సంబంధం కారణంగా వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని చినమట్టపూడి పంచాయతీ పరిధిలోని చిలకమ్మవారిపాలెంలో జరిగింది. ఎస్‌ఐ బి. భార్గవ్ సమాచారం మేరకు గ్రామానికి చెందిన లుక్కా నాగరాజు(42) ఓ దుకాణం నుంచి సరుకులు తీసుకుని ద్విచక్ర వాహనంపై పెట్టుకుంటున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. దీంతో నాగరాజు అక్కడిక్కడే మృతి చెందాడు. హత్య విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నాగరాజు మృతదేహానికి పోలీసులు శవపంచనామా చేసి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగరాజుకు భార్య, కుమారుడు,కుమార్తె ఉన్నారు. మృతుని భార్య శిరీష తన భర్తను గ్రామానికి చెందిన సాంబయ్య చంపి ఉంటాడనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ భార్గవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగరాజు గ్రామంలో బడ్డీకొట్టు నిర్వహిస్తున్నాడు. సరుకుల కోసం గ్రామంలోని సాంబయ్య దుకాణానికి వెళ్లాడు. అక్కడ సరుకులు తీసుకుని వెళ్లుతున్న సమయంలో సాంబయ్య కత్తితో నాగరాజును హత్య చేశాడనే వాదనలు విన్పిస్తున్నాయి. సాంబయ్య భార్యకు నాగరాజుకు వివాహేతర సంబంధం ఉందని, అందుకే హత్య జరిగిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పోలీసుల విచారణలో అసలు నిజం తేలనున్నది.

స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి

యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వినయ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నిజాంపట్నం: కాకినాడలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే స్వర్ణోత్సవ మహాసభల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని యూటీయఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు జె.వినయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్. బాపయ్య పిలుపునిచ్చారు. స్వర్ణోత్సవ సభల ప్రచార జాతాలో భాగంగా మండలంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయ సాధన లక్ష్యంగా ఏర్పడిన యూటీఎఫ్ విద్యారంగ వికాసం, ఉపాధ్యాయ సంక్షేమం తద్వారా సమాజాభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. తొలుత స్వర్ణోత్సవ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎండీ హుస్సేన్, గౌరవాధ్యక్షుడు సీహెచ్. గణేష్‌రావు, జిల్లా కౌన్సిలర్లు డి.హరిబాబు, అబుల్ మాలిక్, కొండలరావు, సుభానీ ఖాన్, మహేశ్వరరావు, చెన్ను సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరికి కత్తిపోట్లు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొలనుకొండలో మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఓ యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొలనుకొండకు చెందిన గుడిపూడి తేజ, గణేష్ స్నేహితులు. ఆటోలో మద్యం తాగుతుండగా వెంకటేష్ అనే వ్యక్తి వచ్చి గణేష్‌తో గొడవకు దిగాడు. తేజ నచ్చజెప్పి పంపించాడు. తేజ అత్త వారింటికి వచ్చి మరోసారి వెంకటేష్ గొడవకు దిగాడు. అప్పుడు ఘర్షణలో వెంకటేష్ కత్తితో దాడి చేశాడు. తేజకు పొత్తి కడుపులో, ఛాతీ కింద భాగంలో గాయాలయ్యాయి. బాధితుడ్ని బంధువులు వైద్య నిమిత్తం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు తేజను విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటయ్య తెలిపారు.

ఎస్జీటీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ప్రభుత్వ విద్యా కార్యక్రమాల సమన్వయం, నిరంతర పర్యవేక్షణ నిమిత్తం తాత్కాలికంగా పని చేసేందుకు అర్హత, ఆసక్తితో పాటు పూర్తిస్థాయిలో కంప్యూటర్ పరిజ్ఞానం గల ఎస్జీటీలు దరఖాస్తు చేయాలని ఆర్జేడీ బి. లింగేశ్వర రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను అన్ని అర్హతలతో కూడిన ధ్రువపత్రాలతో ఈ నెల 7వ తేదీలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

బ్రాహ్మణపల్లిలో పేకాట శిబిరంపై దాడి

13 మంది జూదరుల అరెస్టు



పేకాట రాయుళ్లను తీసుకొస్తున్న పిడుగురాళ్ల పట్టణ పోలీసులు

పిడుగురాళ్ల: బ్రాహ్మణపల్లిలో రహస్యంగా నిర్వహిస్తున్న హైటెక్ పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. 13 మంది జూదరులను అరెస్టు చేశారు. పిడుగురాళ్లకు చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు బ్రాహ్మణపల్లిలోని వివేరా రెస్టారెంట్‌లో ఓ గది అద్దెకు తీసుకుని చాలా రోజులుగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పిడుగురాళ్ల పట్టణ పోలీసులు గురువారం శిబిరంపై దాడి చేశారు. రూ.60,885 స్వాధీనం చేసుకున్నారు. 13 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడెం నుంచి ఇక్కడికి పేకాట ఆడేందుకు వచ్చినట్టు తెలిసింది. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ మోహన్ తెలిపారు.

కొనసాగుతున్న కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన గురువారం 264 మంది హాజరయ్యారు. అందులో 18 మంది ధ్రువపత్రాలను సమర్పించలేదు. మిగతా 246 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించారు. వారిలో 31 మంది ఛాతీ, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. ఇక 215 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా, 33 మందిని అనర్హులుగా ప్రకటించారు. 182 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. 182 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో 68 మంది అర్హత సాధించగా, 114 మంది అనర్హత పొందారు. 182 మందికి లాంగ్ జంప్ చేపట్టగా 167 మంది అర్హత, 15 మంది అనర్హతకు చేరుకున్నారు. 246 మంది కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో 166 మంది అర్హత సాధించగా, 79 మంది అనర్హత పొందారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), ఎ.హనుమంతు (ఏఆర్), పలువురు పోలీస్ అధికారులు పర్యవేక్షించారు.


లక్ష కార్డుల ఉద్యమానికి మద్దతు

కవి డాక్టర్ కత్తి పద్మారావు



పొన్నూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను ఆరో తరగతి నుంచి ఎంఏ వరకు పాఠ్యాంశంగా పెట్టాలని చేపట్టిన లక్ష కార్డుల ఉద్యమానికి తెలుగు రచయితలు పలువురు మద్దతు ప్రకటించారని దళిత మహాసభ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కవి డాక్టర్ కత్తి పద్మారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు వచ్చిన మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే కె.శివాజీ, మాజీ ఎంపీ వి.వి. లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కవి ఆరవ జైపాల్, మాజీ డీఈఓ ఎ. జగదీష్, రచయిత గజేంద్రరావు తదితర రచయితలు, కవులు, సాహితీవేత్తలు, విమర్శకులు, మేధావులు, కళాకారులు, ఉపాధ్యాయులు మద్దతు తెలిపారన్నారు. ముఖ్యమంత్రికి పంపించే పోస్టు కార్డులపై వారు సంతకాలు చేశారని తెలిపారు. పాఠ్యాంశాల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తామని కత్తి పద్మారావు అన్నారు.

జగనన్న కాలనీలో విజిలెన్స్ బృందం సందర్శన



గణపవరం జగనన్న కాలనీలో విజిలెన్స్ అధికారుల సందర్శన

నాదెండ్ల: గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని జగనన్న కాలనీని విజిలెన్స్ అధికారులు గురువారం సందర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో 1200 మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేశారు. అనంతరం లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలు అందించారు. గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు దిగువ భాగాన సర్వే నెంబర్లు 80, 81, 94, 95, 96లలో సుమారు 29.76 సెంట్ల భూమిని కావూరు లింగంగుంట్ల వెళ్ళే రోడ్డులో వీరాంజనేయస్వామి ఆలయం పక్కనే మరో మూడెకరాలు ప్రభుత్వం సేకరించి లబ్ధిదారులకు ప్లాట్లుగా అందించింది. జిల్లా విజిలెన్స్ అధికారి సీహెచ్ శివాజీ, ఏవో ఆదినారాయణ, శ్రీరాంమూర్తిలు కాలనీని సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం భూమిని సేకరించకముందు భూమి ధరలు, సేకరించిన తరువాత ధరలను సమీక్షించారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఆదిలక్ష్మి, అంకమ్మరావు, గ్రామ సర్వేయర్లు ప్రసన్నకుమారి, పవన్‌కుమార్, అనిల్, శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బాషా, సంతోష్, ఉమాదేవి పాల్గొన్నారు.

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో భేటీ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కోర్సుల డీన్ ఆచార్య కొల్లా శ్రీనివాస్ గురువారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. మధుమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. మధుమూర్తికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీరింగ్ కోర్సులు, కళాశాలలు, విద్యార్థుల ప్రవేశాలు, ఉపాధి అవకాశాలు, ఇన్నోవేషన్ తదితర కార్యక్రమాలపై వారు చర్చించారు. సమావేశంలో ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.పూర్ణ చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి మహోన్నతం

విశ్రాంత జిల్లా న్యాయమూర్తి శ్యామ్‌సుందర్ జయరాజు



క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరిస్తున్న విశ్రాంత జిల్లా న్యాయమూర్తి

చీరాల రూరల్: న్యాయవాద వృత్తి మహోన్నతమైనదని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఎస్. శ్యామ్‌సుందర్ జయరాజు అన్నారు. నూతన సంవత్సర వేడుకలను గురువారం ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్‌ఏ) చీరాల ఆధ్వర్యంలో స్థానిక థామస్‌పేటలోని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కోర్టు డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ న్యాయవాదులు నిరంతర విద్యార్థులు కావాలని సూచించారు. ఉన్నత న్యాయస్థానాలు ఎప్పటికప్పుడు కొత్తకొత్త తీర్పులు వెలువరిస్తుంటాయని వాటన్నింటిని కూలంకషంగా చదవాలని చెప్పారు. వృత్తిని అంకితభావం, నిజాయతీతో నిర్వర్తించి కక్షిదారులకు న్యాయ సహాయం అందిస్తే మనల్ని ఎంతో ఆప్యాయతతో గౌరవిస్తారని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, ఐఎల్‌ఏ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మంకెన అశోక్‌కుమార్, కొప్పుల వాసుబాబు, గౌరవాధ్యక్షుడు కర్నేటి రవి, న్యాయవాదులు మిక్కిలి పుల్లయ్య, బొనిగల జైసన్‌బాబు, ఐనంపూడి పవన్‌కుమార్, గోదావరి సురేష్, షేక్ సిరాజ్, కుమార్, సుదర్శనం కరుణకుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

కర్లపాలెం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి చెప్పారు. ఎంవీరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి పాఠశాలల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తోందని చెప్పారు. ఎంఈవోలు ఎం.మనోరంజని, ఎస్.విజయశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల, దాతల సహకారం తీసుకోవాలని యాజమాన్య కమిటీలకు సూచించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి, సీఎంవో శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు టి.వెంకటరాజు, వేణుమాధవ్, పోలీస్‌రావు, పరిశుద్ధరావు, నాగరాజు, వై.వి.నారాయణ పాల్గొన్నారు.

పంట కాల్వలో పడి వృద్ధుడి మృతి

- అలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం
- మృతుడు చీరాలకు చెందిన హరిబాబుగా గుర్తింపు

నగరం: పంట కాల్వలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ బి. భార్గవ్ సమాచారం మేరకు... చీరాలకు చెందిన కే హరిబాబు (60) వారం రోజుల కిందట మండలంలోని ఈదుపల్లిలో బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి తిరిగి వెళ్లే సమయంలో ఈదుపల్లి శివారు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలోని పంట కాల్వలో పడి మృతి చెందాడు. అతడు ఒంటరిగా జీవిస్తున్నాడు.మద్యం తాగే అలవాటు ఉంది. తాగి పంట కాల్వలో పడి మృతి చెంది ఉంటాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తొలుత గుర్తు తెలియని మృతదేహంగా భావించామని, తర్వాత విచారణలో చీరాలకు చెందిన హరిబాబుకు గుర్తించినట్లు ఎస్‌ఐ భార్గవ్ పేర్కొన్నారు. మృతుడు చనిపోయి వారం రోజులు కావడంతో దుర్వాసనతో పాటు గుర్తించేందుకు కూడా వీల్లేకుండా మృతదేహం ఉందని పోలీసులు తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దేశ ప్రగతికి బాటలు వేసిన మన్మోహన్

రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ




మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ గతిని ప్రగతి వైపు మరల్చిన మహనీయుడు మన్మోహన్ సింగ్ అని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంస్మరణ సభను కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో గురువారం నిర్వహించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రధాన వక్తగా శివాజీ మాట్లాడుతూ.. ప్రపంచీకరణ సూత్రాన్ని పాటిస్తూ, సరళీకృత ఆర్థిక విధానాలతో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని అభివృద్ధి వైపు పరుగులెత్తించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రపంచంలోనే అరుదైన రాజకీయవేత్తగా నిలిచారని కొనియాడారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు అనేక పార్లమెంటరీ ఫైనాన్స్ స్థాయి కమిటీల్లో సభ్యునిగా మన్మోహన్ సింగ్‌తో కలిసి పనిచేసే అదృష్టం దక్కిందని గుర్తు చేసుకున్నారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా నిస్వార్థంగా దేశం కోసం పని చేశారని కొనియాడారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ వడ్లమాని రవి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా దేశంలో పేదలకు పని కల్పించి, పేదరికాన్ని పారదోలేందుకు మన్మోహన్ కృషి చేశారని అన్నారు. దేశ ప్రజలకు సంపూర్ణ విద్య హక్కు కల్పించి చైతన్య పరిచారని పేర్కొన్నారు. సమాచార చట్టం హక్కు ద్వారా సామాన్యులకు చేరువయ్యారని తెలిపారు. ఆర్థిక సంస్కరణలతో దేశంలో అభివృద్ధి బాటలు పరిచారని కొనియాడారు. ఆయన ప్రధానమంత్రిగా చేసిన ప్రపంచీకరణ విధానాలతో నేడు దేశ ప్రజలందరూ అభివృద్ధి ఫలాలను ఆస్వాదిస్తున్నారని గుర్తుచేశారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆర్థిక శాఖ మంత్రిగా మన్మోహన్ సింగ్‌కి పూర్తి స్వేచ్ఛనిచ్చి ఆర్థిక సంస్కరణలను కఠినంగా అమలు చేసే విధంగా సహకరించారని వివరించారు. భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ.. ప్రస్తుత దేశ రాజకీయాల్లో మన్మోహన్ సింగ్ వంటి నాయకులు లేరని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, విధానాలు ఎల్లప్పుడూ దేశ ప్రగతికే పరితపించాయని తెలిపారు. కార్యక్రమంలో గాయకుడు గజల్ శ్రీనివాస్, సాహితీ సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ కాకినాడ జిల్లా చైర్మన్ వైడీ రామారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నమూనాను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్ : పట్టణంలోని శంకర్‌విలాస్ వద్ద నిర్మించనున్న ఫ్లైఓవర్ పనుల సమయంలో వాహనదారులు ఇబ్బంది పడకుండా రహదారులను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో దీనికి సంబంధించి అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పనులు ప్రారంభమైతే ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక ప్లానింగ్ ప్రకారం అమరావతి రోడ్డు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా బస్టాండ్ వైపునకు, లైట్ మోటారు వాహనాలు పాట్టి శ్రీరాములు జంక్షన్ నుంచి మూడు వంతెనల వైపునకు మళ్లించాలన్నారు. లక్ష్మీపురం వైపు నుంచి వచ్చే వాహనాలు లాడ్జ్ సెంటర్ నుంచి కంకరగుంట ఆర్వోబీ వైపు, పాఠశాల బస్సులు, ఇతర భారీ వాహనాలు కంకరగుంట ఫ్లైఓవర్ మీదుగా గుజ్జనగుండ్ల వైపునకు మళ్లించాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ మళ్లింపు ప్రత్యామ్నాయ రహదారులలో ఆక్రమణలు తొలగించడంతోపాటు, వాహనాలు పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గతంలో మూసివేసిన బ్రాడీపేట 14 అడ్డరోడ్డు రైల్వే గేటును తిరిగి తెరిపించాలని పేర్కొన్నారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎస్పీ సతీష్‌కుమార్, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి కృషి ముఖ్యం

తెనాలి: నీటిపారుదల వ్యవస్థ సమగ్ర అభివృద్ధికి కృష్ణా పశ్చిమ డెల్టాకు నూతనంగా ఎన్నికైన ప్రాజెక్టు కమిటీ కృషి చేయాలని డెల్టా ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పులిపాటి వెంకటరత్నం సూచించారు. జలవనరుల శాఖ, తెనాలి డివిజన్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం కమిటీ తొలి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. చైర్మన్ పంతాని మురళీధరరావు అధ్యక్షత వహించారు. కమిటీ పరిధిలోని 22 డిస్ట్రిబ్యూటరీ కమిటీల నాయకులు పాల్గొన్నారు. ఈఈ వెంకటరత్నం మాట్లాడుతూ, చట్టంలో పేర్కొన్న ఉపసంఘాలను ఎన్నుకోవాలన్నారు. పశ్చిమ డెల్టా పంట కాల్వలు, డ్రైనేజీలకు రాబోయే సీజనులో చేపట్టాల్సిన పనులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. చైర్మన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. వైస్ చైర్మన్ సునీల్ చౌదరి మాట్లాడుతూ.. డెల్టా చివరి భూముల వరకు సాగునీరందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్థిక వనరులు, నీటి యాజమాన్యం, పర్యవేక్షణ – మూల్యాంకన – శిక్షణ ఉపసంఘాలను ఎన్నుకున్నారు. వాటి కార్యకలాపాలను చర్చించుకున్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్లు తమ పరిధిలోని పంటకాల్వలు, మురుగు కాల్వల సమస్యలు వివరించారు. డివిజన్ కార్యాలయ పర్యవేక్షకుడు డీపీ అనిల్‌కుమార్, పులిపాటి వెంకటరత్నం, నరసరావుపేట ఎన్ఎస్పీ ఇన్‌ఛార్జి ఈఈ ఏవీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.